
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

జాతినేతల ఆశయ సాధనకు కృషిచేయాలి..


2


2

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కలిగోట గంగాధర్



అక్షరటుడే, ఆర్మూర్: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కలిగోట గంగాధర్ నియమితులయ్యారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆయనకు శుక్రవారం నియామక పత్రాన్ని అందచేసి సన్మానించారు. గంగాధర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఈ పదవి ఇచ్చారన్నారు. పార్టీ చీఫ్ రామచంద్రరావు, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.



అంగన్‌వాడీ సరుకులు పక్కదారి.. టీచర్‌పై ఆరోపణలు

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహార సరుకులు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ సరుకులను ఇంటికి తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్న ఘటన చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళ గత కొన్ని రోజులుగా కేంద్రానికి చెందిన సరుకులను ఇంటికి తీసుకెళ్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేంద్రం నుంచి గుడ్లు, నూనె ప్యాకెట్లు తదితర వస్తువులను తీసుకెళ్తుండగా గమనించిన గ్రామస్తులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. చిన్నారులకు అందించాల్సిన సరుకులను ఇంటికి తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ ఇదే విధంగా సరుకులను తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలితే టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు

ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టం, రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులను బేఖాతరు చేస్తూ జిల్లాలోని పలు గ్రామాల్లో వీడీసీలు రాజ్యమేలుతున్నాయి. గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)లు స్వయంప్రకటిత 'సమాంతర వ్యవస్థ'ను నడుపుతున్నాయి. గ్రామ అభివృద్ధి పేరుతో పురుడుపోసుకున్న ఈ కమిటీలు, కాలక్రమంలో అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– అక్షరటుడే, డిచ్‌పల్లి



- గ్రామాల్లో అక్రమ తీర్పులు, బహిష్కరణల పర్వం.!
- 'సమాంతర' వ్యవస్థను నడిపిస్తున్న వైనం
- ఇష్టానుసారంగా ప్రజాధనం ఖర్చు

వీడీసీ దాదాగిరి..

వీడీసీల తీరుతో చాలాగ్రామాలు విసిగిపోతున్నాయి. తాజాగా తాళ్ల రాంపూర్ గ్రామస్తులు వీడీసీల రద్దును కోరుతూ నేరుగా రాష్ట్ర డీజీపీని కలవడం వీరి అరాచకాలకు అద్దం పడుతోంది. గ్రామాల్లో వీడీసీలకు ఉన్న అధికారాలు ఏమిటి..? పరిధి ఎంత..? గ్రామ ప్రజలపై ఆంక్షలు విధించడానికి, వ్యక్తులను శిక్షించడానికి, సామాజిక బహిష్కరణకు పిలుపునివ్వడానికి ఏదైనా చట్టబద్ధమైన అధికారం ఉందా..? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. గ్రామస్తులందరి ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన కమిటీలు కొందరి ప్రయోజనాలకు వేదికలుగా మారుతున్నాయనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, వీడీసీల నిర్ణయాలను వ్యతిరేకించే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి.

చట్టబద్ధత లేని ఆంక్షలు, బహిష్కరణలు

జిల్లాలోని కొన్ని గ్రామాల్లో వీడీసీల ఆధిపత్యం పరాకాష్టకు చేరుతోందని బాధితులు ఆరోపిస్తున్నారు. వారు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తుండటం దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వీడీసీ సభ్యులే గ్రామాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నారని.. వారిమాట వినని కుటుంబాలతో ఎవరూ మాట్లాడకూడదని, వారికి నిత్యావసరాలు అమ్మవద్దని, చివరికి శుభకార్యాలు, అశుభకార్యాలకు వెళ్లవద్దని సామాజిక బహిష్కరణలు విధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆర్థికంగా ఉన్నోళ్లదే రాజ్యం..

గ్రామాల్లో నిరుపేదలు, ప్రశ్నించే గొంతుకలను లక్ష్యంగా చేసుకుని వీడీసీ కమిటీలు పగబట్టి బలిపశువులను చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిగ్రామాల్లో వీడీసీలు పెత్తందారుల ప్రభావంలో పనిచేస్తున్నాయని తెలుస్తోంది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలపై ఆంక్షలు విధించడం, తమ నిర్ణయాలను అంగీకరించని వారిని గ్రామంలో ఒంటరి చేయడం వంటి చర్యలు జరుగుతున్నాయని బాధితవర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలను నిర్ధారించేందుకు పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామాలవారీగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అత్తసొమ్ము.. అల్లుడి దానం..

వీడీసీలో కీలకంగా ఉన్న వ్యక్తి మిగితా సభ్యులకు సైతం డబ్బులు పంచినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. డిచ్‌పల్లి మండల కేంద్రానికి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో వెలుగు చూసిన ఉదంతం వీడీసీల ఆర్థిక అక్రమాలకు పరాకాష్టగా నిలిచింది. గత నెలలో పదవీకాలం ముగిసిన పాత వీడీసీ సభ్యులు, గ్రామానికి చెందిన రూ.వేల్లో ప్రజాధనాన్ని అక్రమంగా పంచుకోవడం తీవ్ర దుమారం రేపింది. వేలంపాటలు.. జరిమానాల రూపంలో వసూలు చేసిన ప్రజాధనానికి ఎలాంటి ఆడిట్ ఉండటం లేదని సమాచారం. ప్రజాధనం ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారని, వీడీసీ సభ్యులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' చందంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లో వీడీసీల ఆగడాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బెయిల్ కోసం అప్పులు.. వాటిని తీర్చేందుకు చోరీల బాట



అక్షర టుడే, కామారెడ్డి: బెయిల్ కోసం చేసిన అప్పులు తీర్చేందుకు ఇద్దరు వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. దీంతో పక్కా సమాచారంతో పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. బాన్సువాడ పట్టణంలోని గౌలిగూడ కాలనీకి చెందిన చింతల భాస్కర్ ఇంట్లో సెప్టెంబర్ 27న బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. అక్టోబర్ 2న బొగ్గుగుడిసె చౌరస్తా సమీపంలో దొంగిలించిన సొత్తును హైదరాబాద్‌లో విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను దండుగుల మైసయ్య అలియాస్ మణికంఠ (25), దండుగుల ఎల్లయ్య అలియాస్ రాజు (20)గా గుర్తించారు. వీరిద్దరూ బంధువులు. నిందితుడు మైసయ్య బాధితుడి ఇంటి పక్కనే ఉంటూ వారి రాకపోకలను గమనిస్తుండేవాడు. జూన్, జూలై నెలల్లో 6 దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లిన మైసయ్యకు బెయిల్ కోసం అతని భార్య అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చేందుకు వైస్సు కు వెళ్లి మద్యం తాగిన తర్వాత ఇద్దరూ కలిసి చోరీకి పథకం వేసినట్లు విచారణలో తేలింది. వారి నుంచి రూ.56 లక్షల విలువైన 31.2 తులాల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి ఆభరణాలు, రూ.9,700 నగదు, హీరో హెచ్ఎఫ్ డీలక్స్ బైక్, 2 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మైసయ్యపై గతంలో బాన్సువాడలో 4, గాంధారిలో 2 కేసులు ఉన్నాయి. నిందితులను బిచ్కుంద కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు. ఈ సమావేశంలో బాన్సువాడ డీఎస్పీ పి. విఠల్ రెడ్డి, టౌన్ సీఐ టి. శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమానికి గాంధీజీ అందించిన సేవలు అమోఘం

అక్షరటుడే, కామారెడ్డి: భారత స్వాతంత్ర్య ఉద్యమానికి మహాత్మా గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సహనం, సామాజిక సమానత్వం వంటి గాంధీజీ ఆశయాలు నేటికీ మార్గదర్శకమన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఐరేని సందీప్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, గంప ప్రసాద్, ఇప్ప శ్రీనివాస్, గోనె శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిసాన్ షాపింగ్ మాల్ ప్రారంభం


కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్, కిసాన్ షాపింగ్ మాల్‌లను శుక్రవారం



ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రారంభించారు. కిసాన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వచ్చిన షబ్బీర్ అలీకి అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా స్వాగతం పలికారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ కామారెడ్డి వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొత్త వాణిజ్య సంస్థలు రావడం శుభపరిణామమని అన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి, మహాత్మ గాంధీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా పేర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి, గాంధీ జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు ఘనంగా నివాళులు అర్పించారు. గణేష్ బిగాల మాట్లాడుతూ.. దేశం కోసం లాల్ బహదూర్ శాస్త్రి చేసిన సేవలు, ఆయన చూపిన నిజాయితీ, నిరాడంబరత, దేశభక్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. దేశ ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ, దేశ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశ రక్షణలో సైనికుల పాత్రను, దేశ ఆహార భద్రతలో రైతుల ప్రాధాన్యతను శాస్త్రి గారు చాటి చెప్పారని గణేష్ బిగాల అన్నారు. అలాగే మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సహనం, సేవామార్గాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన ఆయన నాయకత్వం భారత చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్, సుజిత్ సింగ్, జగత్ రెడ్డి, గాండ్ల లింగం, చింతకాయల రాజు తదితరులు పాల్గొన్నారు.



తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం పేరుతో సైబర్ మోసం

అక్షరటుడే, మాచారెడ్డి : తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం పేరుతో సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. సోషల్ మీడియా వేదికగా వల వేసి ఖాతాల నుంచి చాకచక్యంగా డబ్బులు దోచేస్తున్నారు. మాచారెడ్డి మండలంలో వరుస సైబర్ మోసాల ఘటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని కాకుల గుట్ట తండాకు చెందిన ఓ యువకుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.90 వేలు, ఎల్లంపేట గ్రామానికి చెందిన మరో యువకుడి ఖాతా నుంచి రూ.90 వేలకు పైగా సైబర్ నేరగాళ్లు కాజేశారు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే పాల్వంచ మండలానికి చెందిన ఓ రైతుకు తక్కువ వడ్డీకి రూ.5 లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మించి రూ.లక్ష కాజేసిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. గత ఆరు నెలల్లో ముగ్గురి నుంచి సుమారు రూ.3 లక్షలకు పైగా సైబర్ కేటుగాళ్లు మాయం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మాచారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని పోలీసులు సూచిస్తున్నారు.

నమ్మించి పనికిరాని ప్లాట్లు అంటగట్టారు



అక్షరటుడే, కామారెడ్డి: ధరణి టౌన్ షిప్ పేరుతో నివాసయోగ్యం కాని స్థలాలను అధికారులు తమకు అంటగట్టారని ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డిలోని గెలాక్సీ ఫంక్షన్ హాలులో రాజీవ్ స్వగృహ ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో తమ గోడును వెళ్లబోసుకున్నారు. నాలుగేళ్ల క్రితం 18 నెలల్లో అన్ని వసతులు కల్పిస్తామని, అభివృద్ధి చేసి ఇస్తామని నమ్మించి కలెక్టర్, అధికారులు తమతో ప్లాట్లు కొనుగోలు చేయించారని బాధితులు ఆరోపించారు. నివాస యోగ్యానికి పనికిరాని స్థలాలను తమకు నమ్మించి అంటగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 500 ప్లాట్లలో 330 ప్లాట్లు కొనుగోలు చేసామని తెలిపారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు టౌన్ షిప్‌లో కనీస వసతులు కల్పించలేదని, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు, రోడ్లు వేయలేదని వెల్లడించారు. ప్లాట్ల కొనుగోలు కోసం తాము రూ.లక్షల బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నామని, ప్రతి నెలా ఈఎంఐలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్ షిప్‌లో మౌలిక వసతుల కల్పన కోసం అధికారులు గతంలో రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపినప్పటికి వసతుల కల్పనకు నిధులు సరిపోవని రూ.12 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధుల సహకారం కోరతామన్నారు. అప్పటికి పరిష్కారం కాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజనర్సింహ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జశ్వంత్ రావు, గౌరవ అధ్యక్షుడు కైలాస్ రాజేశ్వర్ రావు, కోశాధికారి కేదార్ నాథ్, ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో అతివలకు అండగా షీటీం : సీపీ సాయిచైతన్య



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: ఆపద సమయంలో అతివలకు అండగా నిజామాబాద్ షీటీం 24 గంటలు అందుబాటులో ఉంటుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లాలో షీ టీం పనిచేస్తున్న విధానాన్ని వివరించారు. జిల్లాలో మహిళలు , చిన్నారుల భద్రత, రక్షణకై షీటీం పోలీసులు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నారని సీపీ తెలిపారు. 2026 జనవరి నుండి సెప్టెంబర్ వరకు 154 కేసులు నమోదు చేశామన్నారు. షీ టీం ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో సంచరిస్తూ మహిళలను వేధిస్తున్న వారిపై దృష్టి సారిస్తుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ బృందాలు యువతులకు, విద్యార్థులకు, పని స్థలాలలో మహిళలకు ప్రత్యేకంగా 416 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చైతన్యపర్చినట్లు వెల్లడించారు. షీ టీంల ద్వారా 161 పెట్టి కేసుల నమోదు చేశామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ బృందాలు జిల్లావ్యాప్తంగా 1,027 హాట్ స్పాట్లలో తనిఖీలు చేశాయన్నారు. 61 కేసులకు కౌన్సెలింగ్‌ల ద్వారా పరిష్కారం చూపించామన్నారు. ఆపత్కాలంలో నిజామాబాద్ షీటీం బృందాలను సంప్రదించాలంటే 8712659795 నంబర్‌కు ఫోన్ చేయాలని సీపీ సూచించారు. 59 గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించి మహిళల పట్ల జరిగే నేరాలపై, చైల్డ్ మ్యారేజ్, సైబర్ నేరాలపై, సోషల్ మీడియా నేరాలపై, చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహనలు కల్పించి చైతన్యపర్చామన్నారు. మహిళల సమస్యలతో దాదాపు 62 మొబైల్ ఫోన్ కాల్స్ వచ్చినట్లు వారికి తగిన సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు.

తాళ్లరాంపూర్ వీడీసీపై చర్యలు తీసుకోవాలి



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ : తాళ్లరాంపూర్ వీడీసీపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని మోపాల్, నిజామాబాద్ రూరల్ మండల గౌడ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ముదక్‌పల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో గౌడ కులస్తులు, గీత కార్మికులపై వీడీసీల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. ప్రభుత్వం గౌడ కులస్తులకు కేటాయించిన లైసెన్సుల ద్వారా గీత వృత్తి చేస్తూ జీవనం కొనసాగిస్తుంటే వారిపై వీడీసీలు దాడులు చేయడం సరైంది కాదన్నారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే ఈ విధంగా సాంఘిక బహిష్కరణ చేయడం చట్ట విరుద్ధమని వారు మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించకుంటే మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల నుంచి వేలాది మంది గౌడ్‌లను ఏకం చేసి 'చలో రాంపూర్' కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు వేణుగౌడ్, సాయిగౌడ్, దశగౌడ్, దత్తగౌడ్ రాజుగౌడ్, అశోక్ గౌడ్, బాలరాజు గౌడ్, ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





'భగీరథ' నీటిపై పట్టింపు లేదా?

అక్షరటుడే,కోటగిరి : మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్న అధికారులు పట్టించుకోవట్లేదని పోతంగల్ మండల ప్రజలు పేర్కొన్నారు. గతవారం రోజుల నుంచి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుకు ఆనుకొని మిషన్ భగీరథ పైపులైన్ పగిలి 24 గంటలు నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ పగలడంతో పలు కాలనీల్లో నీళ్లు రావడంలేదని, కాలనీవాసులు అంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి, పగిలిన పైపునకు మరమ్మతులు చేయించి నీరు వృథాగా పోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.









జాతినేతల ఆశయ సాధనకు కృషిచేయాలి..

జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి చూపిన మార్గం అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. ఉమ్మడిజిల్లాలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ ప్రజల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తూ, దేశ అభివృద్ధి కోసం వారి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్





























జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రెస్ క్లబ్ నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఎడ్ల సంజీవ్ మాట్లాడుతూ.. ఐజేయూ పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా నిరసన తెలుపుతున్నామన్నారు. సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రత కోసం ఒక ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలన్నారు. మీడియా ఉద్యోగుల కోసం కొత్త వేతన మండలి ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు, ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ బాలాజీ, సిరిగాద ప్రసాద్, బొబ్బిలి నర్సయ్య, గంగాదాస్, దేవిదాస్, గోవిందరాజ్, సాయిరాం, మురళి, గంగామోహన్, మురళి, గంగులు పాల్గొన్నారు.

సొసైటీ విభజనకు కృషి చేసిన షబ్బీర్ అలీకి ఘన సన్మానం



అక్షరటుడే, కామారెడ్డి: కాచాపూర్ సొసైటీని బస్వాపూర్ ప్యాక్స్ నుండి విడదీసి సపరేట్ సొసైటీఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ సలహాదారులు, మాజీ మంత్రి షబ్బీర్ అలీని మాజీ ఎంపీపీ, బుస్వాపూర్ ప్యాక్స్ డైరెక్టర్ బైండ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బైండ్ల సుదర్శన్ మాట్లాడుతూ 2003-04 కాలంలో పాత సొసైటీ దివాలా తీయడం, కోర్టు కేసుల కారణంగా నష్టాల్లోకి వెళ్లడంతో కాచాపూర్ సొసైటీని బస్వాపూర్ సొసైటీలో విలీనం చేశారన్నారు. కాచాపూర్‌కు ప్రత్యేక సొసైటీ కావాలని 2005 నుంచే ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టామని.. 2012 ఎన్నికల్లో లింగాల కిష్టాగౌడ్, బైండ్ల సుదర్శన్ సహా పలువురు నేతలు కాంగ్రెస్ నుండి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 2020 ఎన్నికల్లో పొలిటికల్ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ బైండ్ల సుదర్శన్ 93 ఓట్ల మెజారిటీతో గెలుపొందారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సరైన జీవోలు, గెజిట్ నోటిఫికేషన్లు రాక ఈ ప్రక్రియ నిలిచిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత షబ్బీర్ అలీ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. షబ్బీర్ అలీ నాలుగు నెలల పాటు అలుపెరగక శ్రమించి, వ్యవసాయ శాఖ మంత్రి, సంబంధిత కమిషనర్లు, సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి అన్ని అడ్డంకులను తొలగించారన్నారు. ఆయన ఈ కృషి ఫలితంగా అక్టోబర్ 1న కాచాపూర్‌ను ప్రత్యేక సొసైటీగా ప్రభుత్వం అధికారికంగా విడదీసింది. రైతుల మేలు కోసం, కాచాపూర్ సొసైటీ సాధన కోసం ఎంతగానో శ్రమించిన షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.



రెడ్‌క్రాస్ ద్వారా సేవచేసే అవకాశమివ్వండి

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ప్రజలకు సేవచేసే అవకాశం ఇవ్వాలని రెడ్‌క్రాస్ ప్రస్తుత చైర్మన్ బుస్సా ఆంజనేయులు కోరారు. నగరం లోని మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బుస్సా ఆంజనేయులు ప్యానెల్ పేరుతో మొత్తం 14 మంది ప్రస్తుతం పోటీలో ఉన్నామన్నారు. ఈ 14మంది కూడా 15ఏళ్లుగా రెడ్‌క్రాస్‌కు సేవ చేస్తున్నామన్నారు. అర్ధరాత్రి అపరాత్రి అని చూడకుండా రక్తం అవసరం ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో స్పందించి రక్తం ఏర్పాటు చేశామన్నారు. రెడ్ క్రాస్ అంటే కేవలం రక్తదాన సేవలకే పరిమితం కాకుండా తలసేమియా వార్డు, వృద్ధాశ్రమం, డే కేర్ సెంటర్ ఇలా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తమ ప్యానెల్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. మొత్తం 14 మంది గెలిస్తేనే తమ ప్యానెల్ అభ్యర్థి చైర్మన్ అవుతాడని, రెడ్‌క్రాస్ ద్వారా మరిన్ని సేవలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తమ ప్యానెల్‌లో ఏ.రవీందర్, బి.ఆంజనేయులు, బచ్చబోయిడి గంగ కిషన్, బైరి విజయసాగర్, డి.వెంకటేశం, డొల్ల రాజేశ్వర్ రెడ్డి, గున్నల వెంకటేష్ గౌడ్, కరిపే రవీందర్, కులకర్ణి రమేష్ బాబు, ఎం.శ్రీనివాస్, ఎన్.కృష్ణ, నీరడి వెంకటేశ్వర్లు, సైదు రమేష్, సుధాకర్ నరాల ఉన్నారని వివరించారు. ఈ సభ్యులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నరాల సుధాకర్, కరిపె రవీందర్, రమేష్ బాబు, నీరడి వెంకటేశ్వర్లు, బొబ్బిలి కిరణ్, సందేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోచంపాడ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అక్షరటుడే, మెండోరా: పోచంపాడ్ శివారులో గోదావరి నది తీరానికి సమీపంలో, శ్మశానవాటిక వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 60ఏళ్లు ఉంటాయని.. స్కైబ్లూ రంగు చొక్కా, భారత్ బ్రాండ్ బనియన్ ధరించి ఉన్నట్లు ఆమె తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన 8712659864, 8712659763లో సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

జనన, మరణాల నమోదుకు కొత్త నిబంధనలు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: జనన-మరణాల నమోదు చట్టం-2026 గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జనన, మరణాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం వ్యక్తి జన్మించినా, మరణించినా తప్పనిసరిగా సంబంధిత వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. రెండేళ్లు దాటిన తర్వాత జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునే సందర్భంలో జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారి అనుమతి అవసరం కానుంది. అధికారి విచారణ నిర్వహించి, అవసరమైన ఆధారాలను పరిశీలించిన అనంతరం ధ్రువీకరణ పత్రం జారీ చేసే విధానం అమల్లోకి రానుంది. ఒకవేళ రెండేళ్ల తర్వాత ఈ ధృవీకరణ పత్రం పొందాల్సిన పరిస్థితి ఏర్పడితే, నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ : కరెంట్ కోతలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పెద్దకొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. ఒక రోజులో రెండు గంటలు కూడా విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లుగా కోతలు విధిస్తుండడంతో పొలాల్లో నీళ్లు పారట్లేదని వారు వాపోయారు. ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో సబ్‌స్టేషన్‌ను ముట్టడించినట్లు వారు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఒక లైన్‌మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు రైతులను సముదాయించారు.



స్వచ్ఛభారత్ నిర్వహించిన పాలకవర్గ ప్రతినిధులు



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ అధ్యర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జీవన్, 8వ వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ పరిధిలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు తమ పరిసరాల్లో చెత్తాచెదారం వేయకుండా పరిశుభ్రతను పాటించాలని, ప్రతిఒక్కరూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు మున్సిపాలిటీ తరఫున చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.